క్లుప్తంగా

జగన్‌ను కలిసిన విద్యార్థి నేతలు



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో రమేష్, శిరీష్ తదితరులు

అమలాపురం టౌన్: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని పార్టీ జిల్లా విద్యార్థి విభాగం నేతలు తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అమలాపురానికి చెందిన పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జిల్లెళ్ల రమేష్, జిల్లా అధ్యక్షుడు మిండగుదటి శిరీష్ ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

ముత్యాలమ్మకు ఘనంగా క్షీరాభిషేకం



పి.మల్లవరం ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

తాళ్లరేవు: పవిత్ర మాఘ పౌర్ణమి సందర్భంగా పి.మల్లవరం గ్రామ దేవత ముత్యాలమ్మ అమ్మవారికి బుధవారం క్షీరాభిషేకం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అలంకరణలో ఉన్న అమ్మవారికి పంపన నారాయణరావు, రాజేశ్వరి దంపతులు, వారి కుమారులు సతీసమేతంగా క్షీరాభిషేకం, ప్రత్యేక కుంకుమ పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. సర్పంచ్ పంపన రామకృష్ణ, ఆలయ కమిటీ చైర్మన్ విళ్ల సత్యనారాయణ, ప్రతినిధులు విళ్ల వీర, పితాని వీరబాబు, ధూళిపూడి దొరబాబు, భుజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గోపాలకృష్ణ ఆలయ వార్షికోత్సవం



అప్పన్నెద్దుకు అచ్చు వేసి, కోల సంబరం నిర్వహిస్తున్న భక్తులు

తాళ్లరేవు: గ్రామంలోని అయినగడ్డవారి వీధిలో ఉన్న గోపాలకృష్ణ ఆలయ 14వ వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ముమ్మిడి సత్యనారాయణ గురుస్వామి దంపతులతో స్వామివారికి విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, పంచామృతాభిషేకం తదితర విశేష పూజలు జరిగాయి. సీతారామపురం, తాళ్లరేవు, జార్జిపేట గ్రామస్తులు కోల సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అప్పన్నెద్దులకు అచ్చు వేశారు. అనంతరం భారీ అన్నదాన కార్యక్రమం జరిగింది.

హైస్కూలుకు కుర్చీల అందజేత

అమలాపురం టౌన్: పట్టణంలోని కెనరా బ్యాంక్ మెయిన్ బ్రాంచి స్థానిక కొంకాపల్లి జవహర్‌లాల్ నెహ్రూ మున్సిపల్ హైస్కూలుకు రూ.50 వేల విలువైన ఆఫీస్ చైర్లను బుధవారం అందజేసింది. బ్యాంక్ సీఎస్సార్ నిధులతో ఈ కార్యక్రమం చేపట్టింది. హెచ్ఎం కె.ఘన సత్యనారాయణకు బ్యాంక్ బ్రాంచ్ చీఫ్ మేనేజర్ సందీప్ కృష్ణ, సీనియర్ మేనేజర్ కుమారస్వామి ఈ చైర్లను అందజేశారు. బ్యాంక్ అధికారులకు హెచ్ఎంతో పాటు, ఉపాధ్యాయులు బీఎస్ వెంకటేశ్వరరావు, పీవీఎల్ఎన్ శ్రీరామ్ కృతజ్ఞతలు తెలిపారు.

23న వేట కథల సదస్సు

యానాం: సాహిత్య అకాడమీ, స్ఫూర్తి సాహితీ సమాఖ్య, యానాం సంయుక్తంగా నిర్వహిస్తున్న వేట కథల సదస్సు ఈ నెల 23వ తేదీన జరుగుతుందని సమాఖ్య ప్రతినిధి, ప్రముఖ కవి దాట్ల దేవదానంరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు స్థానిక సర్వశిక్షా అభియాన్ సమావేశ మందిరంలో జరిగే ఈ కార్యక్రమంలో జరుగుతుందని తెలిపారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి బలవన్మరణం

ఉప్పలగుప్తం: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఉప్పలగుప్తం గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి హైదరాబాద్‌లో ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడిన విషాదకరమైన సంఘటన ఇది. స్థానికుల వివరాల మేరకు, గ్రామానికి చెందిన కొర్లపాటి శేషారావు(39) పదేళ్లుగా హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. అతడికి వివాహం కాలేదు. అతడి తల్లి కొంత కాలం క్రితం మరణించారు. ప్రస్తుతం తండ్రి, సోదరుడు, ఇద్దరు చెల్లెళ్లు ఉన్నారు. శేషారావు ఆర్థిక ఇబ్బందులు తాళలేక మంగళవారం రాత్రి హైదరాబాద్‌లోని భాగ్యనగర్ కాలనీలో తాను ఉంటున్న గదిలో ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ మేరకు అక్కడి కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. మృతదేహాన్ని బుధవారం స్వగ్రామానికి తరలించగా, బంధువులు అంత్యక్రియలు నిర్వహించారు.

జూదరుల అరెస్టు

ఉప్పలగుప్తం: ఎస్.యానం గ్రామంలో పేకాట శిబిరంపై బుధవారం పోలీసులు దాడి చేశారు. వారి నుంచి రూ.42,560 నగదును స్వాధీనం చేసుకున్నారు. పది మందిని అరెస్టు చేశామని ఎస్సై సీహెచ్ రాజేష్ తెలిపారు.

పర్యాహరణం



ప్లాంట్ నుంచి వెలువడుతున్న కాలుష్యం

కాలుష్యంతో పుడమి తల్లి విలవిల్లాడుతోంది. చెట్టూ.. పుట్టా.. దేనినీ వదలకుండా విరుచుకుపడుతున్న ఈ రక్కసి నుంచి పర్యావరణాన్ని కాపాడుకోలేక కన్నీరు కారుస్తోంది. మూగబోతున్న పక్షులు.. నిర్జీవమవుతున్న పచ్చటి చెట్లకు సాక్షిగా.. అంతులేని స్వార్థం ఎదుట నిస్సహాయంగా తలొంచి మరణ వేదన అనుభవిస్తోంది.

- కాటేస్తున్న చమురు సంస్థల కాలుష్యం
- అనారోగ్యం బారిన పడుతున్న జనం
- మృత్యువాత పడుతున్న పక్షులు, చెట్లు
- స్థానికేతరులకు సీఎస్సార్ నిధులు, ఉద్యోగాలు
- స్థానికులకు మాత్రం మొండిచేయి
- ఆందోళన వ్యక్తం చేస్తున్న స్థానిక ప్రజలు

తాళ్లరేవు: చమురు సంస్థల కాలుష్యం ప్రజలను కాటేస్తోంది. పర్యావరణానికి తీవ్ర విఘాతం కలిగిస్తోంది. కళ్లెదుటే అంతా జరుగుతున్నా.. అధికార యంత్రాంగం తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తోంది. మండలంలో ఉన్న ప్రముఖ చమురు సంస్థల కారణంగా ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారు. కొన్ని రకాల పక్షులు, చెట్లు మృత్యువాత పడుతున్నాయి. ప్రధానంగా పి.మల్లవరం పంచాయతీ గ్రాంటు గ్రామంలో ఉన్న ఓఎన్‌జీసీ గ్యాస్ టెర్మినల్ పైపులైన్ నుంచి యథేచ్ఛగా గ్యాస్‌ను వదలడంతో పాటు, దానిని మండించడం ద్వారా భారీ ఎత్తున శబ్ద కాలుష్యం, విపరీతమైన వాయు కాలుష్యం ఏర్పడుతోంది. గ్యాస్ నుంచి వెలువడే హైడ్రోకార్బన్ల కారణంగా అనేక మంది ఊపిరితిత్తులు, గుండె సంబంధ వ్యాధుల బారిన పడుతున్నారు. దీర్ఘకాల వ్యాధులతో ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్న దుస్థితి నెలకొంది. ఇలాఉండగా పలు రకాల పక్షులు సైతం మృత్యువాత పడుతున్నాయని పర్యావరణ వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే గ్రామాల్లో ఉన్న మొక్కలపై ఆయా వ్యర్థాలు పడడంతో.. నల్లగా మాడి మొక్కలు చనిపోతున్నాయని ప్రజలు చెబుతున్నారు.

వ్యవసాయంపై దుష్ప్రభావం

కాలుష్యం కారణంగా కొబ్బరి దిగుబడి బాగా తగ్గిపోయిందని, వ్యవసాయం, చెరువులపై కూడా కాలుష్య ప్రభావం పడుతోందని పలువురు రైతులు వాపోతున్నారు. బహిరంగంగానే భారీఎత్తున గ్యాస్‌ను వదిలివేస్తున్నప్పటికీ, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు కానీ, పర్యావరణ పరిరక్షణ అధికారులు కానీ పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కంపెనీల నిర్మాణ సమయంలో ప్రజలకిచ్చిన హామీలను గాలికి వదిలి, ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయని స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆయా కంపెనీల నిర్వాకం కారణంగా మత్స్యకారులతో పాటు, అన్ని వర్గాల ప్రజలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని అంటున్నారు. పర్యావరణ పరిరక్షణకు చర్యలు చేపట్టాలని, కంపెనీ కాలుష్యం కారణంగా నష్టపోతున్న స్థానిక ప్రజలకు ప్రతి నెలా పరిహారం అందించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.



పి.మల్లవరం పంచాయతీలో ఉన్న ఓఎన్‌జీసీ ప్లాంటు



నల్లగా మాడిన కొబ్బరి, అరటి చెట్లు

సహకరించడం లేదు



పి.మల్లవరం గ్రామ పంచాయతీలో ఓఎన్‌జీసీ భారీ సంస్థ ఉన్నప్పటికీ, గ్రామాభివృద్ధికి ఎటువంటి సహకారం అందించడం లేదు. కనీసం కంపెనీ ద్వారా పంచాయతీకి కట్టాల్సిన సుమారు రూ.15 కోట్ల పన్నులు సైతం వివిధ కారణాలతో చెల్లించడం లేదు. కంపెనీ నిర్మాణ సమయంలో కలెక్టర్ సమక్షంలో గ్రామాన్ని దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తామని అప్పటి జీఎస్‌పీసీ సంస్థ 16 హామీలిచ్చి, ఏ ఒక్కటీ పూర్తి స్థాయిలో అమలు చేయలేదు.

– పంపన రామకృష్ణ, సర్పంచ్, పి.మల్లవరం

తీవ్రంగా నష్టపోతున్నాం



గ్రామ పరిధిలో ఉన్న చమురు సంస్థ నుంచి వెలువడే కాలుష్యం కారణంగా ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారు. ముఖ్యంగా కంపెనీ నుంచి వెలువడుతున్న వ్యర్థాల కారణంగా మొక్కలకు మసి పట్టి, దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. కొబ్బరి, అరటి పిందె దశలోనే చనిపోతున్నాయి. కాలుష్యం కారణంగా ప్రజలు అనారోగ్యం బారిన పడి, దీర్ఘకాల వ్యాధులకు గురవుతున్నారు. పక్షులు, చెట్లు కూడా నశిస్తున్నాయి.

– ధూళిపూడి వెంకటరమణ, సామాజిక కార్యకర్త

చదువు ఆగిపోయింది



చమురు సంస్థల ఒప్పందంలో భాగంగా ఇంటర్మీడియెట్ చదువుకునే విద్యార్థులకు ప్రోత్సాహం పథకం ద్వారా ఉచితంగా చదివించేవారు. అయితే నాలుగేళ్లుగా ప్రోత్సాహం పథకానికి నిధులు ఇవ్వకపోవడం వల్ల, కళాశాల సర్టిఫికెట్లు చేతికి అందక పిల్లలు చదువును మధ్యలోనే ఆపేస్తున్నారు. వారంతా భవిష్యత్తును తీవ్రంగా నష్టపోతున్నారు.

– పితాని వీరబాబు, విద్యార్థిని తండ్రి

నిధులు ఖర్చు చేయడం లేదు



కంపెనీ నుంచి ఇచ్చే సీఎస్సార్ నిధులు సంస్థ ఉన్న పి.మల్లవరం పంచాయతీలో మొదట ఖర్చు పెట్టాల్సి ఉంది. ఇక్కడ ఖర్చు పెట్టకుండా జిల్లాలోని ఇతర ప్రాంతాలకు కేటాయిస్తున్నారు. కంపెనీ వచ్చి పదేళ్లకు పైగా గడిచినా, గ్రామంలో ఎటువంటి అభివృద్ధి పనులు చేపట్టలేదు. స్థానికులకు ఉద్యోగావకాశాలు కూడా కల్పించడం లేదు.

– పంపన చంద్రరావు, మాజీ ఎంపీటీసీ, పి.మల్లవరం పంచాయతీ

ఎటువంటి అభివృద్ధి చేయలేదు



కంపెనీ నిర్మాణ సమయంలో రహదారులు ధ్వంసమయ్యాయి. కాలుష్యం కారణంగా అనేక మంది ఇబ్బందులు పడుతున్నారు. నిర్మాణ సమయంలో గ్రామాన్ని దత్తత తీసుకుంటామని, గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తామని సంస్థ ప్రతినిధులు హామీ ఇచ్చారు. దత్తత తీసుకోకపోగా, కనీసం ఎటువంటి అభివృద్ధి చేపట్టలేదు. గ్రామాభివృద్ధికి సహకరించకుంటే ఉద్యమం తప్పదు.

– విళ్ల సత్యనారాయణ, స్థానిక నాయకుడు

నీరు కరవాయే.. చుక్క రాదాయే..

సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్, ప్రధాన కాలువ దుస్థితి



ఎండిపోతున్న సామంతకుర్రు కాలువ

అల్లవరం: ప్రధాన కాలువ శివారు ప్రాంతమైన సామంతకుర్రులో చుక్క నీటి కోసం ప్రజలు ఎదురుచూడాల్సిన దయనీయ పరిస్థితి నెలకొంది. పది రోజులుగా సాగు నీటి ప్రవాహం లేక కాలువ ఎండిపోతోంది. ప్రస్తుతం వంతులవారీ విధానం అమలవుతున్నా, కాలువల నిండా చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోవడంతో శివారు ప్రాంతాలకు నీరు వెళ్లడం లేదు. ఎగువ ప్రాంతాల్లో వరి చేలకు సాగునీరు అందక ఇంజిన్ల సహాయంతో నీటిని మళ్లించడంతో శివారు ప్రాంత రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సామంతకుర్రు గ్రామంలో రక్షిత మంచినీటి పథకానికీ నీరు అందడం లేదు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌లోకి నీటిని నింపేందుకు పంచాయతీ సిబ్బంది తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. అయినా ఫలించడం లేదని సిబ్బంది తెలిపారు. ఇదే పరిస్థితి కొనసాగితే వేసవిలో తీవ్ర నీటి ఎద్దడి తప్పదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇరిగేషన్ అధికారులు స్పందించి, కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించాలని కోరుతున్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం



బాధితులకు నిత్యావసరాలను అందిస్తున్న సంఘ నాయకులు

అమలాపురం రూరల్: ఈదరపల్లి బొంతువారిపేటలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాద బాధితులకు ఏపీ ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా శాఖ సాయం అందించింది. రూ.25 వేల విలువైన నిత్యావసర సరకులను, బియ్యం, దుస్తులను బుధవారం అందించింది. ఒక్కొక్క కుటుంబానికి రూ.2 వేల చొప్పున ఆర్థిక సాయం అందించారు. సంఘ జిల్లా అధ్యక్షుడు బత్తుల నకులరాజు మాట్లాడుతూ, ప్రకృతి వైపరీత్యాల సమయాల్లో జిల్లావ్యాప్తంగా సంఘపరంగా చేస్తున్న సేవలను వివరించారు.. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు గోసంగి బంగారాజు, నేరేడుమిల్లి సత్యనారాయణ, బీఎస్ఆర్ ప్రసాద్, సాధనాల సత్యనారాయణ, మంగం సుధాకర్, అంబటి త్రిమూర్తులు, జనిపెల్ల లోవరాజు, నూకపెయ్యి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

అల్లవరం: దేవగుప్తంలో అగ్ని ప్రమాదం జరిగి సర్వస్వం కోల్పోయిన బుంగ మారతమ్మ కుటుంబానికి ఏపీ ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.5,500 నగదు, బియ్యం, నిత్యావసరాలను బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు బత్తుల నకులరాజు, మండల అధ్యక్షుడు ఉప్పే నరసింహారావు, ప్రధాన కార్యదర్శి జనిపెల్ల లోవరాజు, గెడ్డం ప్రదీప్, కేదాసి సత్యనారాయణ, కొనుకు శ్రీనివాస్, గుత్తాల వెంకటేశ్వరరావు, నేల ప్రసాదు, గెడ్డం ఆనందకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సాగు నీటి కోసం రైతుల నిరసన



వన్నె చింతలపూడిలో పొలంలో నిరసన తెలుపుతున్న రైతులు

అమలాపురం రూరల్: మండలంలోని వన్నె చింతలపూడి గ్రామంలో సాగు నీరు రాకపోవడంతో వరి చేనుకు బీటలు వచ్చాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతులను పట్టించుకునే నాథుడే లేడంటూ ఆవేదన వ్యక్తం చేశారు. వరి చేనుకు నీరు అందకపోవడంతో రైతులతో పాటు, కౌలు రైతులు దిగులు చెందుతున్నారు. ఒక్కొక్క రైతు సుమారు 10 ఎకరాలు కౌలు సాగు చేస్తున్నా అధికారులు నీరు అందించడం లేదన్నారు. కనీసం కాలువ పూడిక తొలగించడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. తక్షణం సాగు నీరు అందించకపోతే తీవ్ర నష్టం వాటిల్లుతుందని, అధికారులు స్పందించి నీరందించాలని రైతులు బుధవారం తమ పంట చేలలో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతులు పెయ్యాల సత్యనారాయణ, బుల జగపతి, పరమట వసంతరావు పాల్గొన్నారు.

ఆపరేషన్ల కోసం శునకాల తరలింపు



కుక్కల తరలింపును పర్యవేక్షిస్తున్న అధికారులు

యానాం: పట్టణంలో వీధికుక్కలు స్వైరవిహారం చేస్తున్న నేపథ్యంలో, వాటి సంతానాన్ని నియంత్రించేందుకు యానాం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో వాటికి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించాలని నిర్ణయించారు. ఈ మేరకు బుధవారం 12 శునకాలను కాకినాడకు చెందిన సొసైటీ ఫర్ నేచర్ అండ్ యానిమల్స్ అండ్ ప్రొటెక్షన్(ఎస్ఎన్ఏపీ) సంస్థ ప్రత్యేక వాహనంలో బంధించి తీసుకువెళ్లింది. ఏబీసీ ఆపరేషన్లు చేసి, వాటిని తిరిగి యానాంకు తీసుకువస్తారని అధికారులు తెలిపారు. ఈ ఆపరేషన్ కోసం ఒక్కో కుక్కకు రూ.2,005 ఖర్చవుతుందని ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ ఖండవల్లి రామకృష్ణ తెలిపారు. దశల వారీగా మొత్తం 300 కుక్కలను తీసుకువెళతారన్నారు. వీటికి రూ.6 లక్షల వరకు ఖర్చవుతుందని చెప్పారు. ఈ ఖర్చును మున్సిపాలిటీ భరిస్తుందని తెలిపారు. ఇలాఉండగా స్థానిక బాలయోగి స్టేడియం వద్ద నుంచి ప్రత్యేక వాహనంలో మగ కుక్కలను తరలించారు. ఈ కార్యక్రమాన్ని ఆర్ఏఓ మునిస్వామి, ఇన్‌చార్జి కమిషనర్ రామకృష్ణ, ఇతర అధికారులు పర్యవేక్షించారు.

ముద్రగడ ఇంటిపై దాడి అమానుషం

ఆర్‌పీఐ రాష్ట్ర అధ్యక్షుడు లోక్



సమావేశంలో మాట్లాడుతున్న లోక్

అమలాపురం టౌన్: కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం ఇంటిపై జనసేన కార్యకర్త దాడి చేయడం అమానుష చర్య అని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్‌పీఐ) రాష్ట్ర అధ్యక్షుడు డీబీ లోక్ అన్నారు. ఈ దాడిని అన్ని పార్టీలు, అన్ని వర్గాల వారు ఖండించాలని కోరారు. స్థానిక అరిగెలపాలెంలో బుధవారం జరిగిన పార్టీ నాయకుల సమావేశంలో ముద్రగడ ఇంటిపై దాడి అంశంపై ఆయన మాట్లాడారు. ముద్రగడ అంటే అజాత శత్రువు, స్వార్థం లేని నాయకుడని, అలాంటి ముద్రగడ ఇంటిపై దాడి చేయడం దారుణమన్నారు. ఇది కూటమి నేతలు వెనకుండి ఆడిన నాటకమని, పిరికిపంద చర్య అని వ్యాఖ్యానించారు. ఈ కుట్ర కోణాన్ని కూటమి నేతలు ఖండించకపోవడం విచారకరమన్నారు. ఈ దుశ్చర్యలో జనసేన కార్యకర్తపై పోలీసులు చర్యలు తీసుకుంటూనే, వెనుక సూత్రధారులపై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పార్టీ నాయకులు డి.ఆంజనేయులు, పెయ్యల పరశురాముడు, డి.అశోక చక్రవర్తి, పి.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

మైనర్లు వాహనాలు నడిపితే తల్లిదండ్రులు శిక్షార్హులు

డీఎస్పీ ప్రసాద్ హెచ్చరిక



సదస్సులో మాట్లాడుతున్న డీఎస్పీ ప్రసాద్

అమలాపురం రూరల్: డ్రైవింగ్ లైసెన్స్‌కు అర్హత లేని మైనర్లు వాహనాలు నడిపితే, వారితో పాటు తల్లిదండ్రులు శిక్షార్హులని డీఎస్పీ పీఎస్ఆర్‌కే ప్రసాద్ హెచ్చరించారు. రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా కామనగరువు ఆదిత్య పాఠశాలలో బుధవారం అవగాహన సదస్సు జరిగింది. ప్రిన్సిపాల్ రామప్రసాద్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథులుగా హాజరైన డీఎస్పీ ప్రసాద్, డీటీవో దేశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఇటీవల పేరూరులో జరిగిన రోడ్డు ప్రమాదం కేసులో విద్యార్థి తండ్రిని రిమాండ్‌కు పంపినట్టు తెలిపారు. విద్యార్థి దశ నుంచే రహదారి భద్రతపై అవగాహన ఉండాలని చెప్పారు. 18 ఏళ్లు నిండని వారికి డ్రైవింగ్ లైసెన్స్ పొందే అర్హత ఉండదని స్పష్టం చేశారు. రోడ్లపై మైనర్లు వాహనాలు నడపడం నిషిద్ధమని తెలిపారు. తల్లిదండ్రులు మోటార్ సైకిల్‌పై బయటకు వెళ్లేటప్పుడు హెల్మెట్, కారులో వెళితే సీట్ బెల్టు విధిగా ధరించాలని పిల్లలు చెప్పాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో రహదారి భద్రత ప్రతిజ్ఞ చేయించారు. ఎంవీఐ రవికుమార్ విద్యార్థులకు ట్రాఫిక్ సిగ్నల్స్‌పై అవగాహన కల్పించారు. అమలాపురం ఏఎంవీఐలు కాశీవిశ్వేశ్వరరావు, కౌశిక్, జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ చలపతిరావు, వైస్ ప్రిన్సిపాల్ సుధ, సురేష్‌బాబు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

స్పీకర్‌పై అవిశ్వాసానికి డిమాండ్

యానాం: పుదుచ్చేరి అసెంబ్లీ ఒక రోజు స్వల్పకాలిక సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో స్పీకర్ ఆర్ సెల్వంపై అవిశ్వాసం పెట్టాలని ఇండిపెండెంట్ ఎమ్మెల్యే నెహ్రూ డిమాండ్ చేస్తూ స్పీకర్ పోడియం వద్ద బైఠాయించారు. సభా మర్యాదలను ఉల్లంఘించారంటూ ఇండిపెండెంట్ సభ్యుడు నెహ్రూను సస్పెండ్ చేస్తున్నట్లు స్పీకర్ సెల్వం ప్రకటించారు. అసెంబ్లీ సెక్రటరీయెట్‌లో తాను ఇచ్చిన అవిశ్వాస తీర్మానం పెండింగ్‌లో ఉన్నప్పుడు సెల్వం ఏ విధంగా స్పీకర్ కుర్చీలో కూర్చుంటారని నెహ్రూ ప్రశ్నించారు. అదే విధంగా నెహ్రూతో పాటు, ఇండిపెండెంట్ ఎమ్మెల్యేలు అంగలన్, శివశంకర్ సైతం అవిశ్వాసం పెట్టాలని గత డిసెంబర్‌లో అసెంబ్లీ కార్యదర్శికి వినతిపత్రం అందించారు.

డీఎంకే, కాంగ్రెస్ సభ్యుల వాకౌట్

కేంద్ర బడ్జెట్‌లో పుదుచ్చేరికి వరద నష్టం సహాయం ప్రకటించలేదని నిరసన వ్యక్తం చేస్తూ కాంగ్రెస్, డీఎంకే సభ్యులు వాకౌట్ చేశారు. అనంతరం సభను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ సెల్వం ప్రకటించారు. అలాగే పుదుచ్చేరి వ్యాప్తంగా మద్యం డిస్టలరీలకు అనుమతులు ఇవ్వడాన్ని నిరసిస్తూ బీజేపీ ఎమ్మెల్యేలు జాన్‌కుమార్, కల్యాణ సుందరం, జాన్‌కుమార్‌తో పాటు, బీజేపీకి మద్దతిస్తున్న ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, అంగలన్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

నూతన రేషన్ కార్డుల పంపిణీ

యానాం: దారిద్ర్య రేఖ(బీపీఎల్)కు దిగువన ఉన్న వారికి నిత్యావసరాల పంపిణీకి ఉద్దేశించిన పసుపు రంగు రేషన్ కార్డులను బుధవారం ఆర్ఏఓ మునిస్వామి తన కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వివిధ కారణాలతో నూతన రేషన్‌కార్డుల కోసం సివిల్ సప్లయిస్ శాఖ ద్వారా పలువురు దరఖాస్తు చేసుకున్నారని, తొలి విడతగా ఏడుగురికి రేషన్ కార్డులు అందజేసినట్లు చెప్పారు. ఇకపై ప్రతి ఐదు రోజులకోసారి కొత్త కార్డులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయిస్ అధికారి మెల్లం గౌతమ్ పాల్గొన్నారు.

కోతి చేష్టలు



చెట్టుపై కుక్క పిల్లను ఎత్తుకుని ఉన్న కోతి

యానాం: రోడ్డుపై తిరుగుతున్న ఓ కుక్క పిల్లను కోతి ఎత్తుకువెళ్లిన ఘటన బుధవారం పట్టణంలో పలువురిని ఆకర్షించింది. కుక్క పిల్లను ఎత్తుకుని చెట్లు, గోడలు ఎక్కుతూ తిరుగుతున్న కోతిని పలువురు సెల్‌ఫోన్లలో వీడియోలు తీశారు. కుక్క పిల్లను ఎత్తుకొని కోతి అటూ ఇటూ దూకుతుండడంతో, కుక్కకు ఏదైనా ప్రమాదం వాటిల్లుతుందేమోనని స్థానికులు ఒకింత ఆందోళనకు గురయ్యారు. కుక్క పిల్లను విడిచిపెట్టకుండా, చేసిన కోతి చేష్టలు వారినిఆకట్టుకున్నాయి.

నేడు ఎలుకల నిర్మూలన మందు పంపిణీ

అమలాపురం రూరల్: వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సామూహిక ఎలుకల నిర్మూలన మందు పంపిణీ కార్యక్రమం గురువారం జరుగుతుందని మండల వ్యవసాయాధికారి కదలి ధర్మప్రసాద్ తెలిపారు. ఎలుకల నిర్మూలనకు కోసం బ్రమోడయలిన్ మందును నూకలతో కలిపి ఉచితంగా అమలాపురం మండలంలో అన్ని రైతు సేవా కేంద్రాల్లో రైతులకు ఇస్తారని చెప్పారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ మందును ఎలుక బొరియల్లో పెట్టి, సామూహిక నిర్మూలనకు సహకరించాలని కోరారు. ఎలుకల బారి నుంచి వరి పంట నష్టపోకుండా కాపాడుకోవాలన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అమలాపురం రూరల్: ఈదరపల్లిలో 132/33 కేవీ విద్యుత్ ఉపకేంద్రంలో సీటీ మార్పు, మరమ్మతుల కోసం శుక్రవారం అమలాపురం పట్టణ, రూరల్, అల్లవరం, అయినవిల్లి మండలాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ డీఈఈ కె.రాంబాబు తెలిపారు. ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

చికెన్ సెంటర్లపై దాడులు



ముమ్మిడివరంలో కోళ్లను స్వాధీనం చేసుకుంటున్న కమిషనర్, సిబ్బంది

ముమ్మిడివరం: బర్డ్ ఫ్లూ ప్రబలుతున్న నేపథ్యంలో ముమ్మిడివరం నగర పంచాయతీలోని చికెన్ సెంటర్లపై బుధవారం కమిషనర్ పి.రవివర్మ ఆధ్వర్యంలో సిబ్బంది దాడులు నిర్వహించారు. ఆయా దుకాణాల్లో విక్రయానికి సిద్ధంగా ఉంచిన కోళ్లను, మాంసాన్ని స్వాధీనం చేసుకున్నారు. బర్డ్‌ఫ్లూ ప్రబలుతున్నందున కొన్నాళ్ల పాటు కోడి మాంసం విక్రయాలను నిలిపి వేయాలని కమిషనర్ ఆదేశించారు. ఒక షాపులో ఫ్రిజ్‌లో నిల్వ ఉంచిన చికెన్‌ను స్వాధీనం చేసుకుని, దానిని డంపింగ్ యార్డులో గొయ్యితీసి కప్పేశారు. షాపు యజమానికి రూ.25 వేల జరిమానా విధిస్తామని కమిషనర్ తెలిపారు. బర్డ్‌ఫ్లూ ఉన్నందున ఎవరూ కోడి మాంసం తినకుండా, అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

పి.మల్లవరం చేరిన దివ్య స్వర్ణిమ రథం



పి.మల్లవరంలో కరపత్రాలను స్వీకరిస్తున్న భక్తులు

తాళ్లరేవు: బ్రహ్మ కుమారీస్ యానాం శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దివ్య స్వర్ణిమ రథం బుధవారం పి.మల్లవరం చేరుకుంది. స్థానిక ముత్యాలమ్మ ఆలయం వద్ద సర్పంచ్ పంపన రామకృష్ణ, ఇతర ప్రముఖులు సోమనాథ్ జ్యోతిర్లింగాన్ని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. వచ్చే మహా శివరాత్రిని పురస్కరించుకుని ఈ మహత్తర కార్యక్రమాన్ని చేపట్టినట్లు బ్రహ్మకుమారీస్ ప్రతినిధులు తెలిపారు. వారు మాట్లాడుతూ సమాజంలో అన్ని రంగాలలో భ్రష్టాచారం పెరిగి, నైతిక విలువలు రోజురోజుకూ దిగజారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సత్య గీతాజ్ఞానం, సహజ రాజయోగ శిక్షణ ద్వారా నైతిక విలువలను పెంపొందించి, అందరి జీవితాలలో సుఖశాంతులు నెలకొల్పడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని వివరించారు.